క్లుప్తంగా

రేపు చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం

కోడేరు: మండలంలోని రాజాపూర్‌లో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి 7వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్చకులు భాస్కరశర్మ ఆధ్వర్యంలో రిటైర్డ్ తహసీల్దార్ బాలస్వామి, శారద దంపతులు స్వామి వారికి నూతన ఆభరణాల అలంకరణ, కల్యాణమహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోడేరు: మండల కేంద్రంతో పాటు, తీగలపల్లి, మహాసముద్రం, రాజాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం 11 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాకేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 220 కేవీ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.

నీట్ రద్దు చేయాలి

కల్వకుర్తిరూరల్: నీట్‌లో జరిగిన అవకతవకలను దృష్టిలో ఉంచుకొని పరీక్షను వెంటనే రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని భారత జాగృతి విద్యార్థి విభాగం జిల్లా కన్వీనర్ దారమోని గణేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కల్వకుర్తిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌పై కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. అవతవకలకు పాల్పడ్డవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని మరోసారి నీట్ నిర్వహించాలని కోరారు.

కేంద్ర మంత్రిని కలిసిన జలాల్‌శివుడు



పెద్దకొత్తపల్లి: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్‌కుమార్‌ను ఢిల్లీలో ఆయన అధికార నివాసంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జలాల్‌శివుడు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అభివృద్ధి కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత: కేసు నమోదు

ఉప్పునుంతల: మండల సరిహద్దులోని దుందుబీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ మంగళవారం మొల్గర బ్రిడ్జి వద్ద పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్ యజమాని పానుగంటి రేణయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



కల్వకుర్తిరూరల్: మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన దివ్యాంగుల హక్కుల సంఘం నాయకుడు పేరుమల కృష్ణ ఇటీవల మృతి చెందాడు. మృతుడి భార్య అలివేలకు మిత్రులు కలిసి రూ.19 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో హనుమాన్ దేవాలయం చైర్మన్ రవిగౌడ్, కుర్మిద్ద మాజీ ఉపసర్పంచ్ విజయభాస్కర్, వంశీ, దామోదర్‌రెడ్డి, రామోజీ, శ్రీను, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ చైర్మన్‌కు సన్మానం



తాడూరు: మండలంలోని శిర్సవాడ ఉన్నత పాఠశాలకు కొత్తగా జీహెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన ఏ రమేష్‌కు ఐతోల్ ఉపాధ్యాయ బృందం మంగళవారం సన్మానించారు. అదేవిధంగా ఐతోల్ జీహెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన భాస్కర్‌రెడ్డిని సన్మానించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. కాంప్లెక్స్ చైర్మన్ పాఠశాలను పరిశీలించి సూచనలు, సలహాలు ఇవ్వడంతోపాటు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు.

క్షయ నివారణపై అవగాహన

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో క్షయ వ్యాధి నివారణపై వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలంలో కాలనీల్లో వర్షపు, మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు.

రైతన్న చూపు ఆకాశం వైపు



పెద్దకొత్తపల్లిలో స్పింక్లర్ల ద్వార నీటి తడి ఇస్తున్న రైతులు



మంతటి శివారులో ..



కల్వకుర్తి మండలంలో మార్చాలలో వాడిపోతున్న పత్తి

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో కూడా వరునుడి కోసం రైతన్నకు ఎదురుచూపులు తప్పడం లేదు. రోహిని కార్తెలో కురిసిన వర్షాలకు అన్ని గ్రామాల్లో పత్తి, మొక్కజొన్న, కంది సాగు చేపట్టారు. 10 రోజులుగా వర్షం రాకకోసం రైతులు ఎదురురుచూస్తున్నారు. బోరుబావుల కింద మాత్రం రైతులు స్పింక్లర్‌ల ద్వార మొలకెత్తిన విత్తనాలకు నీరు పారించి పంటలను కాపాడుకుంటుండగా ఎలాంటి నీటి ఆధారం లేని రైతులు మాత్రం ఆందోళనకు గురి అవుతున్నారు. ఇప్పటికే నాగర్‌కర్నూల్ మండలంలో 19 గ్రామ పంచాయతీలకు గాను 35 వేల ఎకరాలలో రైతులు పంటలు సాగు చేసుకున్నారు. 75 శాతం సాగులో పత్తివిత్తనాలు విత్తుకున్న రైతులు వారి పంటలను కాపాడుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు. మరో 15 శాతం మంది రైతులు మొక్కజొన్న, కంది పంటలను సాగు చేసుకున్నారు. మరో 10 రోజులదాకా వాతావరణంలో ఎలాంటి మార్పు లేకపోతే మొలకెత్తిన విత్తనం పూర్తిస్థాయిలో ఎండిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే ఎకరా ఒక్కంటికి విత్తనం, దున్నకం, కూలీల ఖర్చులు కలుపుకొని 10 నుంచి 15 వేల దాకా ఖర్చు చేశారు. వరుణుడు కరుణించకపోతే రైతులు పెద్ద ఎత్తున నష్టపోయే అవకాశం ఉంది.

కల్వకుర్తిరూరల్: మండలంలో రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. తొలకరి వర్షాలు కురవడంతో మండలంలో పెద్ద ఎత్తున పత్తిని సాగు చేశారు. వేసిన పంట కూడా ఎండిపోయే దశకు చేరిందని రైతులు వాపోతున్నారు. 10 రోజులుగా చినుకు పడకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రైతులు ఆకాశం వైపు ఆశగా చూడటం తప్పా చినుకు రాలడం లేదు. మరో రెండుమూడు రోజుల్లో వర్షం కుర్వకపోతే వేసిన పంటలన్ని ఎండిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 9 గంటలకు వరకు మబ్బులు, మధ్యాహ్నం సూర్య వేడిమికి ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

పెద్దకొత్తపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు వానాకాలం పంటగా మొక్కజొన్న విత్తనాలు వేసిన రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలో దాదాపు 5 వేల ఎకరాలలో మొక్కజొన్న విత్తనాలను రైతులు విత్తుకున్నారు. స్పింక్లర్‌ల ద్వార నీటి తడిని ఇస్తున్నారు. నీటి వసతి లేని రైతులంతా వరుడి కోసం ఎదురుచూస్తున్నారు. మండల కేంద్రంతోపాటు దేవల్‌తిరుమలాపూర్, వెనచర్ల, నక్కలపల్లి, చంద్రకల్, ముష్టిపల్లి, మర్రికల్, పెద్దకార్పాముల, నాయనోనిపల్లి, యాపట్ల, మారేడుమాందిన్నె గ్రామాల రైతులు వర్షం ఆశగా ఎదురుచూస్తున్నారు.


నిబంధనలు ఉల్లంఘించొద్దు



తనిఖీలు చేస్తున్న ఏఓ కమల్‌కుమార్

బిజినేపల్లి: ఎరువులు, విత్తనాలు విక్రయించే వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘించొద్దని ఏఓ కమల్‌కుమార్ సూచించారు. మంగళవారం మంగళవారం మండలంలోని పలు వ్యవసాయ దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని ఎరువుల ఇన్వాయిస్‌లు, రైతులకు విక్రయించిన సంచుల వివరాలు, ఈ పాస్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా రశీదు ఇవ్వాలన్నారు. నిబంధనలు ఉల్లంగించిన వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శిథిలావస్థలో పాఠశాల గదులు



పెద్దకొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో కూలడానికి సిద్ధంగా ఉన్న గది గోడలు



బాచారం ప్రాథమిక పాఠశాలలో తేలిన ఇనుప చువ్వలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంతోపాటు, బాచారం ప్రాథమిక పాఠశాలలో గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. విద్యార్థులను పాఠశాలకు పంపించేందుకు తల్లిదండ్రులు వెనకడుగు వేస్తున్నారు. పెద్దపల్లి పాఠశాలలో గోడలు నెర్రలుబారిన పడటంతో ఎప్పుడు కూలుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. అదేవిధంగా బాచారం ప్రాథమిక పాఠశాలలో రెండు గదులు పూర్తిగా దెబ్బతిన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గదుల పైకప్పు పెచ్చులూడి ఇనుపచువ్వలు తేలాయని వాపోతున్నారు. కొత్త గదులు నిర్మించాలని కోరుతున్నారు.

డిజిటల్ తరగతులతో విషయ పరిజ్ఞానం



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఉప్పునుంతల: స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బడిబాటలో భాగంగా డిజిటల్ తరగతుల దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలలోని ప్రొజెక్టర్ బిగ్ స్క్రీన్‌పై డిజిటల్ తరగతుల ప్రయోజనాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. నూతన పాఠ్య పుస్తకాల్లో ప్రతి పాఠ్యాంశానికి సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను ముద్రించామన్నారు. కోడ్‌ను మొబైల్, ట్యాబ్, కంప్యూటర్, ప్రొజెక్టర్‌లో ఏవిధంగా పాఠ్యాంశాలను చూడాలో అవగాహన కల్పించారు. డిజిటల్ పాఠాల ద్వారా విద్యార్థులకు విషయ పరిజ్ఞానం పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు బాలమణి, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యవసర సరుకులు అందజేస్తున్న ఎంపీపీ అరుణ

బల్మూర్: మండలంలోని కొండనాగులలో మంగళవారం గామా ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అరుణ మాట్లాడారు. పేదలకు చేయూతనిచ్చిన గామా ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. సమాజంలో ప్రతి ఒక్కరు సేవా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. సేవతోనే సంతృప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, మండల కోఆర్డినేటర్ అంజి, సభ్యులు అశోక్, మశన్న, సాయి, విజయ్, సహదేవుడు, నగేష్, సైదులు, కొండల్, యాదగిరి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి



తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్‌లో ప్రభుత్వ భూమిని కాపాడాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పోలేరాజు, గిరిజన సంఘం నాయకులు శంకర్‌నాయక్‌లు మంగళవారం తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దాపూర్ రెవెన్యూ శివారులో సర్వే నెంబర్ 130/3లో 2.08గుంటల భూమిని పట్టా మార్పిడి చేశారన్నారు. ప్రభుత్వ భూమిని పట్టాగా మార్చి అక్రమాలకు పాల్పడుతున్నట్లు వారు పేర్కొన్నారు. భూమిని మార్పిడి చేసుకోని పట్టా చేసుకున్న వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పూర్తి విచారణ చేసి తహసీల్దార్ రవికుమార్‌కు వినపతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు సన్మానం



ఊర్కొండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు కల్వకుర్తి క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డివిజన్ టాపర్‌గా నిలిచిన మాధారం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని సభాయాస్మిన్ (9.5 జీపీఏ), ఊర్కొండ జెడ్పీహెఎస్ విద్యార్థిని తబస్సుం (9.3 జీపీఏ)లను అభినందించారు. కార్యక్రమంలో దాత రఘుపతిపేటకు చెందిన క్లాస్‌మేట్ క్లబ్ సభ్యుడు రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనర్సింహారావు, హెచ్‌ఎంలు బాలయ్య, మురళీమోహన్‌గౌడ్, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, రంగరాజన్, పర్వతాలు, సరళ, చంద్రశేఖర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి



కొల్లాపూర్: నీట్‌లో జరిగిన అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీఆర్‌ఎస్‌వీ, బీఎస్‌ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌వీ నాయకులు ధారా శేఖర్, బీఎస్ఎఫ్ఐ నాయకులు బి.దాసు మాట్లాడుతూ నీట్ నిర్వహణ, ఫలితాల వెల్లడి అంతా గందరగోళంగా మారిందన్నారు. నెగిటివ్ మార్కుల అంశాలు, గ్రేస్ మార్కులు కలిపే విధానం అంతా అక్రమాలకు తావిచ్చే విధంగా ఉందన్నారు. అవకతవకలకు పాల్పడిన వారిని బాధ్యులను గుర్తించాలని డిమాండ్ చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

బిజినేపల్లి: రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని మంగళవారం అధికారులు పట్టుకున్నారు. స్థానికులు వివరాల ప్రకారం మండలంలోని మంగనూరు నుంచి దాదాపుగా 4 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా సమాచారం మేరకు పౌర సరఫరాల డీటీ రామ్మోహన్ తనిఖీ చేపట్టారు. వాహనంలో రేషన్‌బియ్యం గుర్తించి పోలీసులకు అప్పగించారు. గ్రామానికి చెందిన పోషన్న, నందివడ్డెమాన్‌కు చెందిన బాలుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సయ్యద్ అలీ తెలిపారు.

పేద విద్యార్థికి చేయూత



కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన పేద విద్యార్థి అక్షిత ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ చేయూతనందించారు. విద్యార్థిని ఇంటర్ చదువు కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో మంగళవారం చేర్పించారు. మార్చాల ఎంపీటీసీ మల్లేష్, నాయకులు తిరుపతి, కృష్ణ, రాజు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం



అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన రుమాండ్ల నిఖిల్, నవ్య దంపతులు రూ.25,116లు అందించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్, ఈఓ శ్రీనివాసరావు సన్మానించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

పెంట్లవెల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఐదు నెలల నుంచి వేతనాలు చెల్లించడంలేదని వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి, వర్కర్లకు చేతి బ్లౌజ్‌లు, పనిముట్లు వెంటనే అందించాలని, కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాలు ఎంపీడీఓ ప్రసన్న కుమారికి అందజేశారు. కార్యక్రమంలో చిట్టెమ్మ, చంద్రయ్య, కృష్ణయ్య, ఖాజా, లక్ష్మి, చందు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న జ్ఞానవికాస భారతి సభ్యులు, ఉపాధ్యాయులు

తాడూరు: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని జ్ఞానవికాస భారతి సభ్యులు సుధారాణి, హెచ్‌ఎం శేషగిరి, బ్రహ్మచారిలు అన్నారు. మంగళవారం జ్ఞానభారతి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని అంతారంలో మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గ్రామానికి చెందిన డా జీనమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమారులు డా అమరేందర్, ధర్మేందర్‌లు పాఠశాలలో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు మొదటి, రెండో ర్యాంకు సాధించిన విద్యార్థులకు రూ.500, రూ.300ల చొప్పున నగదు బహుమతులను అందజేశారు. వైస్ ఎంపీపీ శివలీల, జ్ఞానవికాస భారతి సభ్యులు, హెచ్‌ఎం, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

లింగాల: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీలలో ఏర్పాటులో కుల వివక్షతను నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు బంగారయ్య మంగళవారం అంబట్‌పల్లి అంబేద్కర్ విగ్రహం ఎదుట మహిళలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థులకు వంటలు చేసే ఏజెన్సీల దగ్గర గ్రామాలలో కొందరు వివక్షత చూపుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంటరానితనం నేరమని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికి ఆచరణలో మాత్రం విఫలమవుతుందని విమర్శించారు. అంబట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో వంట చేసేందుకు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు ముందుకు వస్తుంటే నిరాకరిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీలను చిన్న చూపు చూస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల నాయకులు అపరంజమ్మ, శివమ్మ, లక్ష్మి దేవమ్మ, చంద్రకళ, ఈశ్వరమ్మ, చెన్నమ్మ, నర్సమ్మ, నాయకులు కృష్ణయ్య, బారయ్య, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



కొల్లాపూర్ రూరల్: ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని బాలల సంక్షేమ సమితి సభ్యుడు జంగడి విష్ణు అన్నారు. మంగళవారం మండలంలోని మొలచింతలపల్లిలో బాలల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంటల తరబడి మొబైల్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కొందరు లైంగిక మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. సోషల్‌మీడియా ద్వారా పరిచయం అవుతున్న కొత్త వ్యక్తులను నమ్మొద్దన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం వంటి సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తిరుపాలు, మాజీ సర్పంచ్ రాజు, ఉప సర్పంచ్ కొమ్ము వెంకటస్వామి, శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



తాడూరు: మండలంలోని శిర్సవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్టడి మెటీరియల్‌ను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన బాలీశ్వర్ జన్మదినం సందర్భంగా హెచ్‌ఎం రమేష్ ఆధ్వర్యంలో బ్యాగులు, పలకలు, పెన్సిల్, నోట్ పుస్తకాలు అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకొని లక్ష్యాన్ని ఎంపిక చేసుకోవాలన్నారు. చదువుకునే విద్యార్థులకు క్లాస్‌మెట్ క్లబ్ ప్రోత్సాహిస్తుందన్నారు. దాతలు అందించే సహాయసహకారాలను వినియోగించుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో క్లాస్‌మెట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



కొల్లాపూర్: పట్టణంలోని స్కాలర్స్ పాఠశాలలో నిర్వహించిన తైక్వాండోలో ప్రతిభ చాటిన విద్యార్థులకు మంగళవారం ఎస్ఐ హృషికేష్ విభాగాల వారీగా బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణకు తైక్వాండో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో స్కాలర్స్ పాఠశాల కరస్పాండెంట్ రాముయాదవ్, కోచ్ భాస్కర్ యాదవ్, తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మనోహర్‌ప్రసాద్, కార్యదర్శి శేఖర్, మాస్టర్లు శ్రీహరి, శరబందరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం



లింగాల: మండలంలోని కోమటికుంట ఆంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అర్చనలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎత్తపు లక్ష్మణ్‌రావు, ఉపాధ్యక్షుడు దయానందం, కమిటీ సభ్యులు కమలాకర్, గుడి స్వామి, ఆనందరావు, సుధాకర్‌రావు, గుడి శ్రీనివాసులు, చిన్నారెడ్డి, జంగయ్య, రాముడు, శివ, రామకృష్ణ, మల్లేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.